# సాక్షి

## అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 15 । నవంబర్ । 2024






### పుస్తక పఠనంతో మనోవికాసం

గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించి శ్రీకారం చుట్టారు. 8లో



### పుస్తకావిష్కరణ

విశాఖ విద్య: ఏయూ ఆంగ్ల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ రవి విన్సెంట్ రచించిన షాకిల్స్ ఆఫ్ షాడో పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు.



### బాలికల హాస్టళ్ల తనిఖీ

విశాఖ విద్య: ఏయూ రెక్టార్ కిషోర్‌బాబు గురువారం వర్సిటీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసి, ఆహార పదార్థాలపై ఆరా తీశారు.

## న్యూస్‌రీల్

### పిల్లల భవితకు పెద్దలదే బాధ్యత

• కలెక్టర్ దినేష్‌కుమార్



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: పిల్లల ఉన్నత భవితకు తల్లిదండ్రులు, పెద్దలంతా బాధ్యత వహించాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ అన్నారు. గురువారం శ్రీకృష్ణాపురం బాలికల ఆశ్రమ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేకును కట్ చేసి బాలికలకు తినిపించారు. పలు పోటీలలో విజేతలైన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. పిల్లలకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. పిల్లలకు చదువుకునే హక్కుతో పాటు జీవించే హక్కు ఉందన్నారు. తల్లిదండ్రుల కంటే ఉపాధ్యాయుల వద్దే పిల్లలు ఎక్కువ సమయం ఉంటారని, వారి విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలన్నారు. డీఈవో బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ ఇన్‌చార్జి డీడీ రజిని, ఎంఈవో సరస్వతి, హెచ్‌ఎంలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### స్టీల్‌ప్లాంట్‌లో ఉధృతంగా పోస్టు కార్డు ఉద్యమం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టు కార్డు ఉద్యమం ఉధృతంగా సాగుతోంది. స్టీల్‌ప్లాంట్‌లో ప్రైవేటీకరణ వెనక్కి తీసుకోవాలని ఉక్కు ఉద్యోగులు పోస్టు కార్డులు పెద్ద ఎత్తున పంపారు. ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీకి 10 లక్షల పోస్టు కార్డులు పంపాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్లాంట్‌లోని అన్ని విభాగాల్లో కార్మికులు పోస్టు కార్డులపై సంతకాలు చేశారు. కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ అనేక ఉద్యమాల ఫలితంగా ఏర్పడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడాన్ని చేస్తున్న ఉద్యమాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లాల్సి ఉందన్నారు. ఇంజినీరింగ్ షాప్స్ వద్ద జరిగిన కార్యక్రమంలో సీటు నాయకులు జె. అయోధ్యరామ్, వై.టి. దాస్, టి.వి.కె. రాజుతో పాటు ఆయా విభాగాల కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### జాతీయ సేవారత్న అవార్డు గ్రహీతకు సన్మానం



కేజీబీవీలో ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న ప్రత్యేక అధికారి భవాని

దుంబ్రిగుడ: జాతీయ సేవరత్న పురస్కారం అందుకున్న స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ ఇంగ్లిష్ ఉపాధ్యాయిని కమ్మిడి కృష్ణకుమారిని గురువారం సహచర ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రత్యేక అధికారి కె.భవాని మాట్లాడుతూ మానవహక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా కృష్ణకుమారి సేవలు విలువైనవని, ఆమె సేవలను గుర్తించి ఢిల్లీలో జాతీయ సేవరత్న అవార్డు ప్రదానం చేయడం అభినందనీయమని అన్నారు. ఆ పాఠశాల ఉపాధ్యాయినులు వి.సుజాత, పద్మ, కుమారి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు గురుకుల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కొయ్యూరు: జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు కొయ్యూరు గురుకుల జూనియర్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వారిని గురువారం ప్రిన్సిపాల్ జగన్నాథరావు, వైస్ ప్రిన్సిపాల్ బి.వి.రామకృష్ణ, పీడీ సిహెచ్. ఉదయ్‌కుమార్, ఇతర అధ్యాపకులు అభినందించారు. ఈనెల 18 నుంచి 20 వరకు ఉత్తరాఖండ్‌లో హరిద్వార్ వద్ద జరిగే పోటీల్లో ద్వితీయ సంవత్సరం విద్యార్థి జె.జీవన్‌కుమార్, ప్రథమ సంవత్సర విద్యార్థులు టి.భూషణ్, సీహెచ్ కార్తీక్, కె.జయరాంలు పాల్గొంటారని తెలిపారు. కిందటి నెలలో విజయవాడ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.





స్వాతంత్య్ర సమరయోధుల వారసుల కోసం నిర్మించిన గృహ సముదాయాలు

# ఏళ్లనాటి కల.. నెరవేరుతోందిలా!

- స్వాతంత్య్ర సమరయోధుల వారసులకు సొంతిళ్లు
- 11 మందికి త్వరలో ఫ్లాట్లు అందజేత
- రూ.2 కోట్లతో నిర్మించిన నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ
- నాటి ఎంపీ, ఎమ్మెల్యేల చొరవతో ముందుకు వచ్చిన సంస్థ

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజుతో కలసి సాయుధ పోరాటం చేసిన గాం గంటందొర, మల్లుదొర వారసులకు సొంతింటి కల నెరవేరుతోంది. గత ప్రభుత్వంలో అప్పటి ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిల చొరవతో 11 మంది వారసులకు పక్కా ఇళ్లు నిర్మించేందుకు నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ (ఎన్‌సీసీ) ముందుకొచ్చింది. ఈ నిర్మాణ పనుల్ని క్షత్రియ సేవా సమితి పర్యవేక్షిస్తోంది.

కొయ్యూరు: స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలకు సొంతిళ్లు లేవని, గుడిసెల్లో నివసిస్తున్న విషయాన్ని అప్పటి ఎంపీ, ఎమ్మెల్యేల ద్వారా క్షత్రియ సేవా సమితి నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై స్పందించిన సదరు సంస్థ ఇళ్ల నిర్మాణానికి ముందుకొచ్చింది. ఈ మేరకు గతేడాది అక్టోబర్‌లో అప్పటి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, అరకు ఎంపీ మాధవి, ఐటీడీఏ పీవో అభిషేక్ గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేస్తామని ఇచ్చిన హామీని సంస్థ నిలబెట్టుకుంది. రూ.2 కోట్లు వెచ్చించి రెండు భవనాల నిర్మాణం చేపట్టింది. ఒక్కో భవనంలో ఆరు ఫ్లాట్లతో, ఒక్కో ఫ్లాట్‌లో రెండు బెడ్‌రూమ్‌లు, ఒక హాలు, వంటగది, అటాచ్డ్ బాత్‌రూమ్‌లతో నిర్మాణం చేపట్టారు. గాం మల్లు దొర, గంటం దొర మనుమలు 11 మందికి 11 ఫ్లాట్లు కేటాయించి, ఒక ఫ్లాట్‌ను ఎన్‌సీసీ సంస్థ తమ కార్యకలాపాల కోసం వినియోగించుకోనుంది. ఈ ఇళ్లను త్వరలో లబ్ధిదారులకు అందించనున్నారు. ఇది పూర్తయితే ఏళ్ల నాటి కల నెరవేరినట్టవుతుంది.

#### ఆనందంగా ఉంది



ఎన్నో సంవత్సరాల నుంచి సరైన గూడు లేక అవస్థలు పడుతున్నాం. ఇప్పటికి మా నిరీక్షణ ఫలించింది. చాలా ఆనందంగా ఉంది. ఇంత మంచి గృహాలు నిర్మించి ఇస్తున్న సంస్థకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– గాం గంగరాజు, లంకవీధి

#### సొంతిల్లు అదృష్టం



ఎట్టకేలకు సొంత గూటికి చేరుతున్నామన్న ఆనందంలో ఉన్నాం. ఇంత అద్భుతంగా ఇళ్లు నిర్మించి, ఇస్తారని అనుకోలేదు. రెండు బెడ్ రూమ్‌లతోపాటు హాలు, కిచెన్, అటాచ్డ్ బాత్‌రూమ్‌లు నిర్మించడం ఆనందంగా ఉంది.

– గాం సన్యాసమ్మ, లంకవీధి

#### సమర యోధులకు సరైన నివాళి



ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని స్వాతంత్య్ర సమరయోధుల పక్కా ఇళ్ల నిర్మాణం మా హయాంలో పరిష్కారం అయినందుకు ఆనందంగా ఉంది. నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ సంస్థ బాధ్యత తీసుకుని ఇంత అద్భుతంగా గృహాలను నిర్మించడం మర్చిపోలేని విషయం. స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలకు ఇది సరైన నివాళి కాగలదు.

– జి.మాధవి, మాజీ ఎంపీ, అరకు

## అంబులెన్సులు రోగుల కోసమే..

- మిగతా పనులకు వినియోగించవద్దు
- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం



వైద్యారోగ్య శాఖ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : జిల్లాలోని అన్ని అంబులెన్సులను రోగులను చేరవేయడానికి మాత్రమే వినియోగించాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఐటీడీఏ పీవోలు, వైద్యశాఖ అధికారులు, ఆస్పత్రుల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబులెన్సులను మందుల రవాణా, ఇతర పనులకు వినియోగించవద్దన్నారు. అందుకోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో 70 అంబులెన్సులు, 69 ఫీడర్ అంబులెన్సులు, వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో 28 అత్యవసర 108 వాహనాలు ఉన్నప్పటికీ సకాలంలో సేవలు అందకపోవడంపై ఆరా తీశారు. కొత్త వాహనాలకు డ్రైవర్లు లేకపోవడం, ఆయిల్‌కు సరిపడా బడ్జెట్ లేకపోవడం తదితర కారణాలను గుర్తించారు. ఒక్కొక్క వాహనానికి రూ.45 వేలు సరిపోనందున అదనంగా మరో రూ.15 వేల మంజూరుకు ప్రతిపాదించాలని ఆదేశించారు. ప్రతి వాహనం ప్రతి రోజు కనీసం నలుగురు రోగులను చేరవేయాలన్నారు. మృతదేహాలను తరలించేందుకు మహాప్రస్థానం వాహనాల సరఫరాకు ప్రతిపాదించాలన్నారు. ఇకపై అంబులెన్సుల సేవలపై తనకు, ఐటీడీఏ పీఓలకు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. సమీక్ష సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ జమాల్‌బాషా, ఐటీడీఏ ఏఓ హేమలత, 104, 108, ఫీడర్ అంబులెన్సుల మేనేజర్లు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఐటీడీఏ పీఓలు కట్టా సింహాచలం, అపూర్వ భరత్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కృష్ణారావు, తదితర్లు పాల్గొన్నారు.

## రోప్ స్కిప్పింగ్‌లో పతకాల పంట



విద్యార్థులను అభినందిస్తున్న పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో కూడా నైపుణ్యం పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. బందపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించిన సందర్భంగా గురువారం పీవోను కలిశారు.

విద్యార్థులు పాల్గొన్న పోటీలు, సాధించిన మెడల్స్ గురించిన వివరాలను పీడీ తిరుపతిరావు పీవోకు వివరించారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో బందపల్లి ఆశ్రమ పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు పాల్గొని 12 గోల్డ్ మెడల్స్, రెండు సిల్వర్ మెడల్స్ సాధించారని తెలిపారు. రోప్ స్కిపింగ్‌లో ఏపీ తరఫున సీహెచ్ కళ్యాణ్ రావు, కె.సర్వేస్‌బాబుదొర, కె.లోకేష్ పాల్గొన్నట్లు తెలిపారు. ఈ ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయిలో ఢిల్లీ, మహారాష్ట్రలలో జరిగిన పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. పీవో మాట్లాడుతూ గిరిజన విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## కర్రిగుడలో అధికారుల పర్యటన



గ్రామస్తుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

#### డోలీ మోతలపై ఆరా

అనంతగిరి (అరకులోయ రూరల్): గుమ్మ పంచాయతీ పరిధిలో ఉన్న కర్రిగుడ గ్రామానికి గురువారం అధికారులు క్యూ కట్టారు. ఈ గ్రామానికి చెందిన గిరిజనులు రహదారి సౌకర్యం లేక అత్యవసర సమయాల్లో డోలిలను ఆశ్రయిస్తారు. గత బుధవారం కర్రిగుడ గ్రామానికి చెందిన కుమార్(47)ని అనారోగ్యం కారణంగా బంధువులు డోలిలో ఆసుపత్రికి తరలిస్తున్న వీడియో, ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొటింది. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు కర్రిగుడ గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ మాణిక్యం, ఎంపీవో కుమార్, ఈవోపీఆర్డీ లాలం సీతయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రావు, వైద్యాధికారి మంజుభార్గవి, ఆరోగ్య విస్తరణ అధికారి సంజీవరావులు మండల అధికారుల బృందం గురువారం పర్యటించింది. గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కుమార్ మాట్లాడుతూ గతంలో పలుమార్లు డోలీమోతల కథనలు రావడంతో కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేకంగా సందర్శించామన్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాలతో నివేదిక తయారు చేసి కలెక్టర్ దృష్టిలో పెడతామన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా మండల స్థాయి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని గిరిజన ప్రజలకు సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్తా సూపర్‌వైజర్ లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి సాయిప్రసన్న, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పంప్ స్టోరేజ్ నిర్మాణానికి స్థల పరిశీలన



పంప్ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మించబోయే ప్రాంతంలో పర్యటించిన అటవీ శాఖ, జెన్‌కో అధికారులు

సీలేరు: సీలేరులో నూతనంగా నిర్మించే ప్రాజెక్టు కోసం స్థల పరిశీలనకు అటవీ శాఖకు చెందిన బృందం వచ్చింది. అటవీశాఖ అదనపు పీసీసీఎఫ్ రాహుల్‌పాండే నేతృత్వంలోని ఈ బృందం సభ్యులు జెన్‌కో అధికారులతో కలిసి పర్యటించారు. అయితే మీడియాకు వివరాలు వెల్లడించడానికి వారు నిరాకరించారు. అధికారుల బృందం పర్యటన విషయం తెలుసుకున్న విలేకరులు జెన్‌కో గెస్ట్ హౌస్‌కు వెళ్లగా గంటసేపు నిరీక్షణ తర్వాత మాట్లాడకుండా వెళ్లిపోయారు. సీలేరు పంచాయతీ పరిధిలో పంప్ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టే పార్వతీనగర్ గ్రామస్తులకు ఇల్లుకు ఇల్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు ఎటువంటి సమాచారం లేకుండా రహస్యంగా ఉన్నతాధికారులు పర్యటించడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు వాపోయారు.

## నష్టపరిహార బాధితులకు హైకోర్టులో ఊరట



చింతపల్లి, కొయ్యూరు జెట్పీటీసీలు బాలయ్య, నూకరాజు

చింతపల్లి: కైలాసపట్నం మిషనరీ ఆశ్రమంలో విషాహారం తిని మృతి చెందిన గిరిజన విద్యార్థి కుటుంబానికి నష్టపరిహారంపై హైకోర్టు ఉత్తర్వులు ఊరటనిచ్చాయని చింతపల్లి, కొయ్యూరు జెట్పీటీసీలు బాలయ్య, నూకరాజులు చెప్పారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మాసిటీలో ప్రమాదవశాత్తూ మృతి చెందిన కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం అందించి ఏజెన్సీ ప్రాంతంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలతో సరిపెట్టిన ప్రభుత్వంపై చర్యలు చేపట్టాలని హైకోర్టును ఆశ్రయించామన్నారు. మైదాన ప్రాంత బాధితులకు, గిరిజన ప్రాంత బాధిత కుటుంబాలకు వ్యత్యాసం లేకుండా ఒకేలా నష్టపరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఫిర్యాదు చేశామన్నారు. నష్టపరిహారం సమానంగా ఎందుకు ఇవ్వలేదో వివరిస్తూ కౌంటర్ దాఖలు చేయమని సంబంధిత శాఖలకు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. న్యాయస్థానం ద్వారా బాధిత గిరిజన కుటుంబాలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు జెట్పీటీసీలు బాలయ్య, నూకరాజులు తెలిపారు.

## ఎన్‌సీసీ క్యాడెట్‌ల సందర్శన



తీరప్రాంత భద్రత విషయాలను ఎన్‌సీసీ క్యాడెట్‌లకు వివరిస్తున్న నేవీ అధికారి

సింధియా (విశాఖ): తూర్పు నావికాదళ కమాండ్ ఆధ్వర్యంలో వివిధ కళాశాలల నుంచి వచ్చిన ఎన్‌సీసీ క్యాడెట్‌లు ఈస్టర్న్ నేవల్ కమాండ్ పరిధిలోని సాగర్ ప్రహరీ బాల్, నావల్ ఆపరేషన్స్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విచ్చేసిన ఎన్‌సీసీ క్యాడెట్‌లకు తూర్పు తీరంలోని తీరభద్రత అంశాలను వివరించారు.

# బాల్యం గుర్తుకొచ్చింది



బాలికలతో క్యారమ్స్ ఆడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- చిన్న పిల్లాడిలా సందడి చేసిన కలెక్టర్ దినేష్‌కుమార్
- క్యారమ్స్ ఆడి.. కేక్ తినిపించి.. చిన్నారులతో మమేకం
- పాడేరు బాలసదనంలో సాక్షి మీడియా ఆధ్వర్యంలో బాలల దినోత్సవం
- ఆటల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం

చిన్నారులతో క్యారమ్స్ ఆడారు.. ఎత్తుకొని ముద్దులాడారు.. కేక్ కట్ చేసి వారికి తినిపించారు.. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు పంచిపెట్టారు.. విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే కలెక్టర్ కాసేపు చిన్న పిల్లాడిలా మారిపోయారు. సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పాడేరులోని ప్రభుత్వ బాలసదనంలో నిర్వహించిన బాలల దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అక్కడి బాలికల్లో ఉత్సాహం నింపారు.



పాడేరు బాలసదనం చిన్నారులు, సిబ్బందితో కలెక్టర్ దినేష్‌కుమార్



బాలికలకు కేక్ తినిపిస్తున్న కలెక్టర్



పరుగుపందెం విజేతకు బహుమతి ప్రదానం

సాక్షి, పాడేరు/పాడేరు: అఖం శుభం తెలీని అనాథలు వారు.. ప్రభుత్వ బాలసదనంలో ఆశ్రయం పొందారు.. బాలల దినోత్సవం సందర్భంగా సాక్షి మీడియా గురువారం నిర్వహించిన క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వయంగా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతులు అందించడంతో వారి ఆనందానికి అవధులు లేవు. తొలుత బాలసదనం సూపరింటెండెంట్ రెడ్డి ఊర్మిళతో కలిసి వారు పుష్పగుచ్ఛాలతో కలెక్టర్‌కు స్వాగతం పలికారు. తొలి ప్రధాని నెహ్రూ చిత్రపటం వద్ద కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాలలతో నివాళులర్పించారు. బాలల దినోత్సవ కేక్‌ను బాలికలతో కలిసి కట్ చేశారు. కలెక్టర్ స్వయంగా కేక్ తినిపించడంతో వారంతా సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం బాలికలతో కలిసి కలెక్టర్ దినేష్‌కుమార్ క్యారమ్స్ ఆడారు. తన బాల్యం మళ్లీ తిరిగి వచ్చినట్టుందని వ్యాఖ్యానించారు. రన్నింగ్, క్యారమ్స్, ఖోఖో, చెస్, తదితర పోటీలలో విజేతలైన బాలికలకు సాక్షి మీడియా సమకూర్చిన బహుమతులు, బిస్కట్ ప్యాకెట్, చాక్లెట్లను కలెక్టర్ దినేష్‌కుమార్ పంపిణీ చేశారు.

**కలెక్టర్ ఆత్మీయతకు మురిసిన చిన్నారులు**

కలెక్టర్ దినేష్‌కుమార్ బాలసదనంలోని 50మంది బాలికలతో మమేకం అయ్యారు. వారందరినీ ఆప్యాయంగా పేరుపేరున పలకరించారు. నెహ్రూ వేషధారణలో ఉన్న ఏడాదిలోపు వయసున్న ఓ బాలుడిని కలెక్టర్ ఎత్తుకుని ముద్దులాడారు. చాచా అంటూ చొక్కాకు గులాబి పువ్వును అలంకరించారు. వివిధ పోటీల్లో విజేతలైన బాలికలకు కలెక్టర్ దుశ్శాలువా కప్పి పూలదండలను అందజేశారు. 'థాంక్యూ కలెక్టర్ సార్' అంటూ వారంతా నినాదాలు హోరెత్తించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలంతా బాగా చదువుకోవాలన్నారు. మీతో కలిసి బాలల దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు ఏర్పాట్లు చేసిన సాక్షి మీడియాకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాక్షి స్టాఫ్ రిపోర్టర్ నవర మోదకొండబాబు, ఆర్‌సీ ఇన్‌చార్జి కొంతా దుర్గారావు, టీవీ చానల్ విలేకరి వంతాల జోషి, వీడియోగ్రాఫర్ రమేష్, పాడేరు కేజీబీవీ పీఈటీ ఎం.వెంకటలక్ష్మి, బాలసదనం సిబ్బంది పాల్గొన్నారు.



బాల నెహ్రూను ఆత్మీయంగా ఎత్తుకున్న కలెక్టర్ దినేష్‌కుమార్

## క్లుప్తంగా

### అంతరిక్ష యాత్రకు సహకరించండి

- కలెక్టర్‌కు ఆదివాసీ యువకుడి విజ్ఞప్తి



కలెక్టర్ దినేష్‌కుమార్‌తో మాట్లాడుతున్న భద్రయ్య

చింతూరు: ఎంతో క్లిష్టమైన అంతరిక్ష యాత్ర చేసేందుకు తనకు సహకారం అందించాలని ఎవరెస్టు అధిరోహించిన చింతూరు మండలం కొత్తపల్లికి చెందిన ఆదివాసీ యువకుడు దూబి భద్రయ్య కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కోరాడు. ఈ మేరకు గురువారం పాడేరులో కలెక్టర్‌ను కలిసిన భద్రయ్య ఆయనకు వినతిపత్రం అందచేశాడు. ఈ సందర్భంగా భద్రయ్య మాట్లాడుతూ ఎవరెస్టు అధిరోహించిన తనకు ఎంతో ఉన్నతస్థాయికి ఎదగాలనే ఆకాంక్ష, ఆత్మస్థైర్యం బలంగా ఉన్నాయని తెలిపాడు. అంతరిక్ష యాత్ర చేసి ఆదివాసీల ఉన్నతిని ప్రపంచానికి చాటి చెప్పాలన్నది తన కోరికని, ప్రభుత్వం సహకారమందిస్తే ఆ ఘనత సాధిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశాడు. నిరుపేదనైన తనకు అంతరిక్ష యాత్ర చేసేందుకు కావాల్సిన ఆర్థిక స్థోమత అందించాలని భద్రయ్య కలెక్టర్‌ను కోరాడు.

### 'అడవి తల్లికి హారతి' నేడు

జి.మాడుగుల: మండలంలో సింగర్భ పంచాయతీ మొండికోటలో శ్రీశైల ఆనందాశ్రమంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు అడవి తల్లికి హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు రమేష్, మత్స్యరాజు తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త కొండవీటి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

### ప్రమాదంలో గాయపడిన బాలిక మృతి

కొయ్యూరు: గాదేగుమ్మి జంక్షన్ వద్ద ప్రమాదంలో గాయపడిన బాలిక విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌ఐ కిషోర్ వర్మ గురువారం సాయంత్రం తెలిపారు. చింతపల్లి మండలం బలభద్రం గ్రామానికి చెందిన చెందిన కొర్రా నందిని (15) బుధవారం అతని బావ, చెల్లితో కలిసి బంగారంపేటకు బైక్‌పై వెళ్తుండగా, నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో అదుపు తప్పి ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నందిని తలకు తీవ్రమైన గాయం కావడంతో ఆమెను కృష్ణదేవిపేట ఆస్పత్రిలో చేర్పించగా, అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌ఐ కిషోర్‌వర్మ తెలిపారు. నందిని తండ్రి ఫిర్యాదు మేరకు వాహనచోదకుడు తలుపులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

# గిరిరైతుల్లో వర్షం గుబులు

- వరి కుప్పలపై టార్పాలిన్ల ఏర్పాట్లు
- సురక్షిత ప్రాంతాలకు పంట తరలింపులో నిమగ్నం
- ఆందోళనలో అన్నదాత



కల్లంలో వరి కుప్పలపై వేసిన టార్పాలిన్లు



వరి కట్టలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న గిరిజనులు

హుకుంపేట: ఏజెన్సీ ప్రాంతంలో పడుతున్న వర్షాలు కారణంగా గిరిజన రైతులు భయందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వరి పంట ఆశాజనకంగా ఉన్నప్పటికీ ఒక్కసారిగా వర్షాలు ప్రారంభం కావడంతో చేతికి వచ్చిన వరి పంట నష్టం వాటిల్లే అవకాశం ఉందని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని మూడు రోజుల నుంచి పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కొన్ని చోట్ల వరి పంట ఇప్పటికే వరి పనలు తడిచి ముద్దయింది. వరి కోతలు ప్రారమమైనప్పటికి కోత కోసిన వరి పంటను నష్టం వాటిల్లకుండా గిరిజనులు జాగ్రత్తలు పడుతున్నారు. వర్షం దెబ్బ తినకుండ కోసిన వరి పనలు పునరావాస ప్రాంతాలకు తరలించే పనుల్లో గిరిజన రైతులు నిమగ్నమయ్యారు. కోత ప్రారంభమైన ప్రాంతంలో వరిని కట్టలు కట్టి కల్లాల్లో తరలించి టార్పన్‌లతో కట్టి జాగ్రత్త పడుతున్నారు. తుపాను కారణంగా ఈ ఏడాది చేతికి వచ్చిన పంటను ఎలా కాపాడుకోవాలో నని పలువురు గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.



వరి కోతలు చేస్తున్న గిరిజనులు

# క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తు

**ఐటీడీఏ పీవో అపూర్వభరత్**



చింతూరులో బహుమతులు అందజేస్తున్న పీవో అపూర్వభరత్

చింతూరు: క్రమశిక్షణతో విద్యనభ్యసించడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత అవకాశాలు అందిపుచ్చుకునే అవకాశముందని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ అన్నారు. జనకళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీలో గురువారం నిర్వహించిన బాలల దినోత్సవ కార్యక్రమంలో పీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు విద్యతో పాటు ఇతర రంగాల్లో రాణించడం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గుతుందని, మంచి ప్రతిభను చాటుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు కూడా మెండుగా వుంటాయని ఆయన సూచించారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు ఆయన బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో విజయగౌరి, సొసైటీ ఛైర్మన్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ రమాదేవి పాల్గొన్నారు.

**చదువులో రాణించాలి**

మారేడుమిల్లి: విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం నిర్వహించిన బాలల దినోత్సవంలో సబ్ కలెక్టర్ పాల్గొన్నారు. ప్రతి రోజు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను నేర్చుకుంటూ సబ్జెక్టులో ముందుకు వెళ్లాలన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం ఎంపీపీ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు.



మారేడుమిల్లిలో విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

# ఎఫ్‌ఆర్‌ఎస్ నుంచి మినహాయించాలని వినతి




పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖాధికారులు, సిబ్బంది

- పాడేరులో ర్యాలీ, ధర్నా చేపట్టిన వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు
- కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేత

పాడేరు : వైద్యారోగ్య శాఖలో వివిధ కేడర్లలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి ముఖ ఆధారిత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శెట్టి నాగరాజు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు డిమాండ్ చేశారు. సిఐటీయూ ఆధ్వర్యంలో వైద్యారోగ్య శాఖలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది గురువారం పాడేరు పట్టణంలోని మోదకొండమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగాణం నుంచి పాత బస్టాండ్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. వైద్యారోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, సమస్యల పరిష్కారం కోసం గతంలో అనేక సార్లు ఆందోళన కార్యక్రమాలు చేసినా పరిష్కారించలేదన్నారు. గిరిజన ప్రాంత భౌగోళిక, వాతవరణ పరిస్థితులు, స్థానిక స్థితిగతులు, నెట్‌వర్క్ తదితర సమస్యల కారణంగా ముఖ ఆధారిత హాజరు వీలుపడదన్నారు. అక్టోబర్ నెలలో 70 మంది ఎన్‌ఆర్‌హెచ్‌ఎం ఉద్యోగులకు రూ.22వేల వేతనం రావాల్సి ఉండగా ఎఫ్‌ఆర్‌ఎస్ సమస్య కారణంగా కేవలం రూ.600 మాత్రమే వేతనాలు వచ్చాయన్నారు. ఈ విషయంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందికి పూర్తిగా మినహాయింపు ఇవ్వాలన్నారు. అర్హులైన ఏఎన్‌ఎంలను హెచ్‌వీలుగా పదోన్నతి కల్పించాలన్నారు. గ్రామ సచివాలయ హెల్త్ సెక్రెటరీలకు వైద్యశాఖలో విధులు మినహా వేరే ఏ ఇతర విధులు అప్పగించవద్దన్నారు. ఉద్యోగుల పట్ల దురుసుగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్‌కు అందజేశారు. సీఐటీయూ ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, సుందర్‌రావు, హెల్త్ సెక్రెటరీల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎంవీవీఎస్ కుమారి, ప్రధాన కార్యదర్శి తులబోతి, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు

# పుస్తక పఠనంతో మనోవికాసం

దాబాగార్డెన్స్ (విశాఖ): పుస్తక పఠనం ద్వారా అజ్ఞానం తొలగిపోతుందని, పేదరికం కనుమరుగవుతుందని, యువతకు బంగారు భవిష్యత్తు సిద్ధిస్తుందని కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ అన్నారు. విద్యార్థులు, యువత గ్రంథాలయాలకు రావాలని, పుస్తకాలు చదవడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. సూర్యాబాగ్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం ఏర్పాటు చేసిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రంథాలయాలు మనందరికీ దారిచూపే లైట్ హౌస్‌లు వంటివని అభివర్ణించారు. అలాగే బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని అదే ప్రాంగణంలోని నెహ్రూ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిల్లలందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభంలో భాగంగా వాటి ఆవశ్యకత, ఉనికి, ప్రయోజనాల గురించి కలెక్టర్ ఉపదేశించారు. అబ్దుల్ కలాం వంటి ఎంతో మంది మహనీయులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకున్నారని, పుస్తక పఠనానికి ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. చాలా మంది యువత మొబైల్ వినియోగానికి ఎక్కువ సమయం వృథా చేసుకుంటున్నారని, అలా కాకుండా వారి సమయాన్ని పుస్తకాలు చదవడానికి, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవటానికి వెచ్చించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రోద్బలం, విద్యాశాఖ మంత్రి సహకారంతో జిల్లాలోని గ్రంథాలయాలను అభివద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. ప్రేమ్ కుమార్, జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు, డివిజనల్ పీఆర్వో డి. నారాయణరావు, స్థానిక ఎంఈవోలు, గ్రంథాలయ సంస్థ అధికారులు, సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



అరకులోయ డిగ్రీ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్

**పుస్తక పఠనంతో విజ్ఞానం**

అరకులోయ రూరల్: మండల కేంద్రం ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. దీంతో విజ్ఞాన సముపార్జన కలుగుతుందన్నారు. గ్రంథాలయాల్లో పోటీ పరీక్షల పుస్తకాలు ఇతరత్రా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. క్రమశిక్షణతో మెలిగి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. గ్రంథాలయ ఇన్‌చార్జి కొండబాబు, సిబ్బంది కృష్ణమోహన్, గణేష్, విజయలక్ష్మి, సునీల్, అప్పారావు పాల్గొన్నారు.



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్

కూనవరం: మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను లైబ్రేరియన్ మాదేటి గోవిందరాజు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఈనెల 14 నుంచి 21వ తేది వరకు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గోవిందరాజులు మాట్లడుతూ గ్రంథాలయ వారోత్సవాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం పలువురు పెద్దలు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు లైబ్రరీ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని వెల్ఫేర్ అసిస్టెంట్ సాయిలక్ష్మి చేతులమీదుగా సరస్వతిదేవి చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. డాక్టర్ వెంకయ్య, ఈటీపీఆర్టీ రామాంజనేయ ప్రసాద్, కార్యదర్శి సురేష్, వెంకటస్వామి, లైబ్రరీ సహాయకులు నాగరాజు, సూదిపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మైథలాజికల్ థ్రిల్లర్ 'దేవకీ నందన వాసుదేవ'

దాబాగార్డెన్స్: అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే మిథలాజికల్ థ్రిల్లర్ మూవీ 'దేవకీ నందన వాసుదేవ'అని ఆ సినిమా హీరో గల్లా అశోక్ అన్నారు. సినిమా ప్రమోషన్లలో భాగంగా గురువారం చిత్ర బృందం విశాఖలో సందడి చేసింది. నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హీరో మాట్లాడారు. దర్శకుడు అర్జున్ జంధ్యాల కమర్షియల్ సినిమాకు వినోదం మేళవించి అద్భుతంగా తెరకెక్కించారన్నారు. ఈ సినిమాకు హనుమాన్ దర్శకుడు ప్రశాంత వర్మ కథ అందించారని, ఈ చిత్రం ట్రైలర్, టీజర్లకు మంచి స్పందన వచ్చిందన్నారు. సూపర్‌స్టార్ మహేష్‌బాబుతో యాక్షన్ సినిమా చేయాలని ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మంచి చేయాలనుకునే వారికి దేవుడు ఎప్పుడూ వెంటే ఉంటారని, సాయం చేసే వారే దేవుడనే కాన్సెప్ట్‌తో ఈ సినిమాను రూపొందించినట్లు తెలిపారు. బోయపాటి శ్రీనివాస్ వద్ద తాను దర్శక విభాగంలో పనిచేసినట్టు దర్శకుడు అర్జున్ జంధ్యాల చెప్పారు. తెలుగు అమ్మాయి హీరోయిన్‌గా నటిస్తోందని, తప్పకుండా ఈ చిత్రం అందరికీ నచ్చుతుందన్నారు. హీరోయిన్ మానస వారణాసి మాట్లాడుతూ మోడలింగ్ నుంచి సినిమాల్లోకి వచ్చినట్లు తెలిపారు. మిస్ వరల్డ్ పోటీల్లో టాప్-10లో నిలిచానని గుర్తు చేశారు. సమావేశంలో నిర్మాత సోమినేని బాలకృష్ణ పాల్గొన్నారు.

## అప్పన్న ఉపాలయ పరిచారకుడు సస్పెన్షన్

సింహాచలం: శ్రీ హహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి ఉపాలయంగా ఉన్న కొండదిగువ పైడితల్లి అమ్మవారి ఆలయంలో పరిచారకుడిగా విధులు నిర్వహిస్తున్న ఎమ్. సుబ్బారావును సస్పెండ్ చేసినట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు గురువారం తెలిపారు. సుబ్బారావుపై ఇటీవల విశ్వహిందూ పరిషత్ నాయకులతో పాటు పలువురు ఈవోకి ఫిర్యాదు చేశారు. కొండదిగువ పైడితల్లి ఆలయానికి బదిలీ చేసినా సుబ్బారావు ఇంకా గతంలో పనిచేసిన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ వంటగదిని తన ఆధీనంలో ఉంచుకున్నారని, బినామీ అర్చకులను పెట్టుకుని విధులకు గైర్హాజరు అవుతున్నారని, ఇంకా అనేక విషయాలను లిఖితపూర్వకంగా ఈవోకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపిన ఈవో సస్పెన్షన్ వేటు వేశారు. అలాగే దేవస్థానంలో ఒక మహిళా సూపరింట్ తీరుపై సీఎంకు పలువురు ఫిర్యాదు చేయడంతో దేవస్థానం డిప్యూటీ ఈవోని విచారణకు ఆదేశించినట్టు ఈవో తెలిపారు.



## జన్‌మన్ కార్యక్రమానికి గిరిజన బృందం



జన్‌మన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు విజయవాడ వెళ్తున్న బృందం బస్సుకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఐటీడీఏ అధికారులు

పాడేరు : భగవన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా ఈనెల 15న విజయవాడలో నిర్వహిస్తున్న జన్‌మన్ కార్యక్రమానికి వీడీవీకే గిరిజన బృందం గురువారం బయలుదేరి వెళ్లారు. వీరు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఐటీడీఏ ఏపీఓలు వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ మురళి ఐటీడీఏ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఏపీఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని వన్‌ధన్ వికాస్ కేంద్రాలు నిర్వహిస్తున్న ఉత్పత్తులపై స్టాల్లు ఏర్పాటుచేస్తారన్నారు. గిరిజన కళాకారులు థింసా నృత్యం, స్వయం సహాయక బృందం సభ్యుల కోలాటం ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఏజెన్సీలో అమలు చేస్తున్న గిరిజన సంక్షేమ పథకాలపై లబ్ధిదారులతో ముఖ్యమంత్రి మాట్లాడుతారని తెలిపారు. వెలుగు సిబ్బంది అప్పారావు. వీడీవీకే సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



ధనుంజయ్ (ఫైల్)



జీడి తుప్పల మధ్యన ధనుంజయ్ మృతదేహం

కొయ్యూరు: గూడెం మండలం ఎర్రచెరువులకు చెందిన బూసరి ధనుంజయ్(20) మృతిని అనుమానాస్పద కేసుగా నమోదు చేసినట్టు సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ కిషోర్ వర్మ తెలిపారు. వారు గురువారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ గూడెం మండలం ఎర్రచెరువులకు చెందిన ధనుంజయ్ కొద్ది రోజుల కిందట బకులూరులో అక్క ఇంటికి వచ్చారని తెలిపారు. అయితే మద్యం అలవాటు ఉన్న అతను ఈనెల 12న రాత్రి పది గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, ఆచూకీ తెలియలేనట్టు చెప్పారు. గ్రామంలోని సమీప తోటల నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు అక్కడ మృతదేహం ఉన్నట్టు గుర్తించి తమకు సమాచారం అందించారన్నారు. ఈ మేరకు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి, ధనుంజయ్‌గా గుర్తించినట్టు చెప్పారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు చెప్పారు.

# చంద్రబాబు సూపర్ 6 హామీలన్నీ బూటకమే

- ఏ ఒక్కపథకానికి సక్రమంగా బడ్జెట్ కేటాయింపులు లేవు
- ప్రజావ్యతిరేకతను తప్పించుకునేందుకే డైవర్షన్ పాలిటిక్స్
- చంద్రబాబు ఇంకా అబద్ధాలకోరు
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజం



ఎంవీపీకాలనీ: అధికారమే లక్ష్యంగా చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ 6 హామీలన్నీ బూటకమేనని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. లాసన్స్ బే కాలనీలోని శాసన మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో చంద్రబాబు బృందం అనేక అబద్ధాలను ప్రచారం చేసి గద్దెనెక్కిందన్నారు. సూపర్ -6తో ప్రజలను మభ్యపెట్టారన్నారు. అయితే ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సూపర్ 6 పథకాల్లో ఏ ఒక్క పథకానికి సరైన కేటాయింపులు చేయలేదన్నారు. సూపర్ 6 అమలుపై చంద్రబాబు ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో ఈ కేటాయింపులే చెబుతున్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత కూడా చంద్రబాబు అబద్ధాలు మానలేదన్నారు. గత ప్రభుత్వం రూ.14 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిందని ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు పలు సందర్భాల్లో చెప్పారని..అయితే ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రం అప్పు రూ.6 లక్షల 40 వేల కోట్లుగా వెల్లడించారన్నారు. దీన్ని బట్టి ఇన్నాళ్లు రాష్ట్ర అప్పులు రూ.14 లక్షల కోట్లని చెప్పిన చంద్రబాబు ఎంతటి అబద్ధాలకోరో అర్థమవుతోందన్నారు. ఈ రూ.6లక్షల 40 వేల కోట్లు అప్పులో రూ.3లక్షల 13 వేల కోట్లు గత చంద్రబాబు టైంలో చేసినవేనన్నారు. చంద్రబాబు చేసిన అప్పు టీడీపీ నాయకులు, కార్యకర్తలు దోచుకోవడం కోసమే వినియోగించారని దుయ్యబట్టారు. 2019 నుంచి 2024 మధ్య జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.3 లక్షల కోట్లు అప్పుచేస్తే అందులో రూ.2లక్షల 75 వేల కోట్లు రాష్ట్ర ప్రజల సంక్షేమానికే ఖర్చు చేసిందన్నారు. ఎన్నికల్లో ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తానని ప్రకటించిన చంద్రబాబు దానికి బడ్జెట్‌లో రూ.12,500 కోట్లు కేటాయింపులు చేయాల్సివుండగా కేవలం రూ.5 వేల కోట్లే కేటాయించారన్నారు. నిరుద్యోగ భృతికి ఒక్కరూపాయి కూడా కేటాయించలేదన్నారు. 18 ఏళ్లు దాటిన మహిళల కోసం ప్రకటించిన ఆడబిడ్డ నిధి పథకం అమలుకు రూ.26 వేల కోట్లు అవసరం కాగా తగిన కేటాయింపులు చేయలేదన్నారు. సీఎం చంద్రబాబు ప్రకటించిన పథకాలకు మొత్తంగా ఏడాదికి రూ.1 లక్ష 20 వేల కోట్లు అవసరం అవుతుండగా బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లు మాత్రమే కేటాయింపులు చేశారన్నారు. ఇదీ పథకాల అమలుపై ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వస్తున్న ప్రజా వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భయపడేది లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల పేరుమీద టీడీపీ, కూటమి వారు అప్పుడు ఐడీలు క్రియేట్‌చేసి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి నాయకుల అబద్ధాలను, డైవర్షన్ పాలిటిక్స్‌ను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయ ఇన్‌చార్జ్ రవిరెడ్డి, కార్పొరేటర్ మహమ్మద్ ఇమ్రాన్, జిల్లా పార్టీ ఐటీ విభాగం అధ్యక్షుడు బోండా ఉమా, పార్టీ నాయకుడు దొడ్డి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అండగా ఉంటాం

**వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా బాధిత కుటుంబాలను పరామర్శించిన అమర్‌నాథ్**

మద్దిలపాలెం: ఎవరూ భయపడొద్దు..పార్టీ అండగా ఉంటుంది..న్యాయ స్థానాలపై నమ్మకం ఉంది.. న్యాయం గెలుస్తుందన్న నమ్మకం ఉంది..అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్..సోషల్ మీడియా బాధిత కుటుంబాలనుద్దేశించి మాట్లాడారు. మద్దిలపాలెం 23వ వార్డులో సోషల్ మీడియా కార్యకర్త రమణారెడ్డి కుటుంబీకులను అమర్‌నాథ్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇచ్చిన హామీలు అమలు చేయని చంద్రబాబు..ప్రశ్నించినవారి నోరునొక్కే ప్రయత్నాల చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులను టార్గెట్ చేసి..వారిని అక్రమంగా అరెస్టులు చేయడం తగదన్నారు. గతంలో ఇలాంటి దుశ్చర్యలు జరగలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యాలయం ఇన్‌చార్జ్ రవి రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు మొల్లు అప్పారావు, కార్పొరేటర్ మహమ్మద్ ఇమ్రాన్, జిల్లా పార్టీ ఐటీ విభాగం అధ్యక్షులు బోండా ఉమా, పార్టీ నాయకులు దొడ్డి కిరణ్, పులగం సూర్యనారాయణ రెడ్డి , పులగం శ్రీనివాస్ రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



రమణారెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్